ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి ఖమ్మం KHAMMAM
ఆదివారం, 12 మే 2024
7

ఉష్ణోగ్రత: ఖమ్మం గరిష్ఠం: 41, కనిష్ఠం: 23 ; భద్రాద్రి కొత్తగూడెం గరిష్ఠం: 41, కనిష్ఠం:26



బీఆర్ఎస్, బీజేపీలకు ఓటుతో గుణపాఠం

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- ఖమ్మంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి

9



ఖమ్మంలో గులాబీజెండా ఎగురవేస్తాం

- టీడీపీ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

9



కాషాయ జెండా ఎగురవేయాలి

- బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి
- ఖమ్మంలో బైక్ ర్యాలీ

8

సైలెన్స్..

- ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- చివరిరోజు పోటాపోటీగా ర్యాలీలు
- ఇక పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల దృష్టి
- రేపటి పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు



ఖమ్మం, మే 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత పదిహేను రోజులుగా హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారఘట్టం శనివారం సాయంత్రంతో ముగిసింది. చివరిరోజు ప్రధాన పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రచార పర్వంలో అగ్రనేతలు తమ పార్టీల తరుపున నిలిచిన అభ్యర్థులకోసం సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థులు రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాంనాయక్ తరుపున సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగూడెంలో జనజాతర సభ నిర్వహించారు. మరోవైపు ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మరోవైపు ఖమ్మం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, హీరో వెంకటేష్, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, మంత్రి పొంగులేటి సతీమణి మాధురి, హరీ వెంకటేష్, మంత్రి పొంగులేటి కుమార్తెలు అశ్రిత, సప్నిరెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యతోపాటు ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం ఖమ్మంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి బైక్‌ర్యాలీ నిర్వహించారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో బలరాంనాయక్ విజయం కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. మొత్తం మీద అధికార కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని వ్యూహాత్మకంగా నిర్వహించింది.

ఇక బీఆర్ఎస్ పార్టీ తరుపున ఖమ్మంనుంచి బరిలో ఉన్న నామా నాగేశ్వరరావు

మిగతా 9వ పేజీలో...

భద్రాద్రి జిల్లాలో

సాయంత్రం 4 వరకే ఓటింగ్

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రియాంక అల

9

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- హోం ఓటింగ్‌లో ఖమ్మం ముందంజ
- ఓటర్లను వాహనాల్లో తరలించడం నేరం
- రవాణాకు 'సాక్ష్యం' యాప్ ద్వారా నమోదు
- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి
- ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

9



నేడు ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ 9 ఇరు జిల్లాల్లో 144 సెక్షన్

ఓటేయండిలా..

- ఓటరు కార్డు, స్లిప్ లేకున్నా పర్లేదు..
- గుర్తింపు కార్డు ఉంటే చాలు..

ఖమ్మం, మే11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంటు పరిధిలో మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఉండగా.. వారికి సంబంధించిన ఓటరు గుర్తింపు కార్డులను అధికారులు దాదాపు పంపిణీ చేశారు. వాటితోపాటుగా ఓటరు స్లిప్పులను సైతం పంపిణీ చేయగా.. అందుబాటు లో లేనివారివి, చనిపోయినవంటి వారివి, స్థానికంగా ఉండని వారికి సంబంధించిన 40వేల స్లిప్పులను సంబంధిత ఎన్నికల అధికారులకు పంపించారు. అయితే అవి రెండు లేకున్నప్పటకీ ఓటు వేయడానికి అర్హత ఉంటే నేరుగా వెళ్లి ఓటు వేయొచ్చు.

అయితే ఓటరు తనకు సంబంధించిన ఏదో ఒక గుర్తింపు కార్డును తనవెంట తీసుకెళ్లి తన ఓటు ఉందా లేదా అన్న విషయాన్ని ధ్రువీకరించుకోవాలి. ఓటరు స్లిప్పు అన్నది కేవలం సమాచారం కోసం మాత్రమే కాగా... గుర్తింపు లేకపోయినప్పటికీ ఎన్నికల సంఘం జారీ చేసిన 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులను చూపించి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. ఆధార్ కార్డు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు, బ్యాంకు, పోస్టు ఆఫీసు వారిచే జారీచేసిన పాసు పుస్తకం, కార్మిక మంత్రిత్వ శాఖ జారీచేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పీఎస్‌యులు, పబ్లిక్ లిమిటెడ్ సంస్థల ఉద్యోగులకు ఫొటోతో జారీ చేసిన ఐడీ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన ఐడీ కార్డు, ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డులలో ఏదో ఒకదానితో ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఓటర్లు @ 16,31,039

ఖమ్మం/కొత్తగూడెం, మే11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఏడు నియోజకవర్గాల్లో 1,896 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో భద్రాచలం, పినపాక, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 658 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 5,81,570 ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో..

నియోజకవర్గం	ఓటర్లు	కేంద్రాలు
ఖమ్మం	3,24,073	355
పాలేరు	2,40,806	290
మధిర	2,22,160	268
వైరా	1,93,389	252
సత్తుపల్లి	2,43,943	294
కొత్తగూడెం	2,47,494	253
అశ్వారావుపేట	1,59,174	184
మొత్తం	**1,63,1039**	**1,896**

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో..

నియోజకవర్గం	ఓటర్లు	కేంద్రాలు
పినపాక	2,03,790	240
ఇల్లెందు	2,25,097	242
భద్రాచలం	1,52,683	176
మొత్తం	**5,81,570**	**658**



పోలింగ్ కేంద్రాలపై నిఘా

- 1,896 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్
- 621 లోకేషన్లలోనూ సీసీ కెమెరాలతో నిఘా
- నిరంతరాయంగా పోలింగ్ ప్రత్యక్ష ప్రసారం
- ఎన్నికలు సుజావుగా సాగేందుకు నిర్ణయం

ఖమ్మం, మే11(ఆంధ్రజ్యోతి)/ ఖమ్మం కలెక్టరేట్, మే 11: గత 2014 ఎన్నికల్లో ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామంలో సీపీఐ, సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్ వర్గీయులపై దాడి చేయడంతో ఇద్దరు పోలింగ్ ఏజెంట్లు ఒక కానిస్టేబుల్ తలకు గాయమైంది. కామేపల్లి మండలం పింజరమడుగులోనూ టీడీపీ, ఇతర పార్టీల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఇలా గత సంఘటనలను ఆధారంగా పోలీసులు ఈ సారి ఎన్నికలకు గట్టి నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఈనెల 13న జరిగే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ వీపీ గౌతమ్ విప్లవాత్మక నిర్ణయాలను ఈ సారి అమలుచేస్తున్నారు.. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలోనే మెదటి సారిగా మన జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుండడం విశేషం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను ప్రత్యక్ష ప్రసారంతో పర్యవేక్షించనున్నారు. దీనితో పాటు 621 లోకేషన్లలో పోలింగ్ కేంద్రాల వెలుపల కూడా పరిస్థితిని అంచనా వేసేందుకు సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటు చేశారు.

ఖమ్మం లోక్‌సభ పరిధిలోఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1896 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 230 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పోలీస్ అధికారులు గుర్తించారు. ఇక్కడ మైక్రో అబ్జర్వర్‌తో పాటు,పోలీసులను నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం ఆవరణంలోకి ఎవరు వెళ్తున్నారు.. ఏ దిశగా వస్తున్నారు.. ఎటువెళ్తున్నారనే వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టనున్నారు. ప్రత్యేకంగా వీడియోకెమెరాను కూడా ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పోలింగ్ దృశ్యాలను కెమెరాల్లో నిక్షిప్తం చేయనున్నారు.

వెబ్‌క్యాస్టింగ్ ఇలా.. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1896 పోలింగ్ కేంద్రాలకు గత అసెంబ్లీ ఎన్నికలలో అన్ని కేంద్రాల్లోనూ వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించారు.అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లోనూ కేంద్రాలన్నిటిలోనూ సీసీ కెమెరాలతో వెబ్‌క్యాస్టింగ్ చేపట్టారు. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

విధుల్లో పదివేలమంది సిబ్బంది

పోలింగ్ కోసం10వేల మందికి పైగా సిబ్బందిని వినియోగిస్తున్నారు. పీవోలు 2,183మంది, ఏపీవోలు 2,183 మంది, ఓపీవోలు 4,366మంది మొత్తం 8,732మంది విధుల్లో ఉన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఇల్లెందు అసెంబ్లీ పరిధిలోని కామేపల్లి మండలానికి ఇక్కడి నుంచే 160 మంది పోలింగ్ సిబ్బంది పాల్గొంటారు. వారితోపాటు 180 మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహిస్తారు. 2391 మంది పోలీసులు, 6 కంపెనీల సిఆర్‌పీఎఫ్ బలగాలు,17 సెక్షన్ల టీఎస్ఎస్‌పీ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. నియామావళిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండటంతోపాటు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏడు నియోజకవర్గాల్లో 27 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, 21 సర్వేలెన్స్ స్టాటిటిక్స్ టీంలు, 37 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు, 203 మంది సెక్టార్ అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నాయి.

ఖమ్మం జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, వాటికి ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్న వివరాలు ఇలా..

నియోజకవర్గం	కేంద్రాలు	సమస్యాత్మకం	వెబ్ క్యాస్టింగ్	సీసీటీవీ నిఘా
ఖమ్మం	355	27	355	120
పాలేరు	290	51	90	96
మధిర	268	47	268	88
వైరా	252	40	252	71
సత్తుపల్లి	294	44	294	100
కొత్తగూడెం	253	18	253	83
అశ్వారావుపేట	184	3	184	63
మొత్తం	1896	230	1896	621

నామా గెలుపు కోసం
కోడలు ప్రచారం



మట్టి తవ్వుతూ ప్రచారం చేస్తున్న మనోజ్ఞ

ముదిగొండ/ వైరా, మే 11: ఖమ్మం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని ఆయన చిన్నకోడలు మనోజ్ఞ శనివారం ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. మట్టి పనులు చేశారు. అత్యధిక మెజార్టీతో నామా నాగేశ్వరరావును గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాల్వంచ రాజేష్, తోట ధర్మా, వీరబాబు, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు. వైరా మండలంలోని పలు గ్రామాల్లో నామా తనయులు పృథ్వీతేజ, భవ్యతేజలు రోడ్‌షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కనకగిరి సిరిపురంలో తండ్రి విజయాన్ని కాంక్షిస్తూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత పూసలపాడు, గౌండ్లపాలెం, విప్పలమడక గ్రామాల్లో రోడ్‌షో, ఇంటింటి ప్రచారం ద్వారా ఈనెల 13న జరిగే ఎన్నికల్లో నామాను గెలిపించాలని కోరారు.

విజిలేశారు..

- సీ విజిల్‌కు 80 ఫిర్యాదులు



ఖమ్మం, మే11(ఆంధ్రజ్యోతి): 'సీ విజిల్' యాప్ ఎన్నికల్లో ఎక్కడైనా రాజకీయ పార్టీ లు, నేతలు ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడటం వంటివి చేస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. అలా చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడటంతోపాటు.. యాప్‌లో వీడియోలు, ఫొటోలు చిత్రీకరణ వంటి వివరాలు నేరుగా ఎన్నికల అధికారులకు చేరుతాయి. అక్కడినుంచి స్థానికంగా ఉన్న అధికారులకు సమాచారం అందించబడుతుంది. అలా ఫిర్యాదు వచ్చిన వెంటనే '100 నిమిషాల' సమయంలో వారు దాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 80 ఫిర్యాదులు అందాయి. ఖమ్మం జిల్లాలో 75 ఫిర్యాదులు అందగా.. 72 ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పూర్తిచేశారు. మరో మూడు ఫిర్యాదులు మాత్రం 100 నిమిషాల తర్వాత పూర్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5 ఫిర్యాదులు రాగా.. వాటిని నిర్ణీత సమయంలోగానే పూర్తి చేశారు. ఇక 1950 కాల్ సెంటర్‌కు ఖమ్మం జిల్లాకు 153, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 82 కాల్స్ వచ్చాయి. వాటిల్లో అత్యధికంగా దరఖాస్తులకు సంబంధించి, ఓటరు ఎపిక్ కార్డుల గురించి సమాచారం తెలుసుకోడానికే చేసినవే ఉన్నాయి. కాగా శుక్రవారం నాటికి రూ.3.47కోట్ల నగదు సీజ్ చేయగా.. అందులో 2.61 కోట్లు సంబంధిత ఆధారాలు చూపిన వారి నగదును విడుదల చేశారు. మూడు కేసులకు సంబంధించిన రూ. 86.26 లక్షల నగదును, రూ. 20.07 లక్షల విలువ చేసే 275 గ్రాముల బంగారాన్ని ఐటీ శాఖకు అప్పగించి విచారణ నిర్వహిస్తున్నారు. వాటితోపాటుగా రూ. కోటి విలువైన 13,750 లీటర్ల లిక్కర్‌ను, రూ. 24.39 లక్షల 97.86 కిలోల గంజాయిని సీజ్ చేశారు.



బుల్లెట్ నుంచి బ్యాలెట్ పోరుకు..

- సైద్ధాంతిక విభేదాలతో పార్టీలో చీలికలు
- ఇల్లెందు ఏజెన్సీలో విప్లవ పార్టీకి ఘన చరిత
- ఎన్నికల పోరులో విప్లవ పార్టీల అభ్యర్థి



విప్లవ పార్టీల అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ

ఇల్లెందు, మే11: నక్సల్‌బరి ఉద్యమాల ప్రేరణతో పురుడుపోసుకొని భూమి, భుక్తి, విముక్తి కోసం సాయుధ పోరాట పంథాను ఎంచుకున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ క్రమంగా బుల్లెట్ వదిలి బ్యాలెట్ వైపు అడుగులు వేస్తోంది. ఈక్రమంలోనే మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో నక్సల్ ఉద్యమ నేపథ్యం ఉన్న మోకాళ్ల మురళీకృష్ణను బరిలో నిలిపింది. 1968లో అవిర్భవించిన ఎంఎల్ పార్టీ ఆచరణలో సైద్ధాంతిక ఎత్తుగడల్లో తలెత్తిన విభేదాల మూలంగా అనేక గ్రూపులుగా చీలింది. ఐదున్నర దశాబ్దాల సాయుధ పోరాట మార్గంలో విప్లవ రాజకీయాలు ఎన్నికల సమయంలో మరింత ఉధృతంగా ప్రచారం చేసుకోవచ్చని భావించి 1978 నుంచి పార్లమెంటరీ పంథాను ఎంచుకుంది. తమ విప్లవోద్యమంలో భాగంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తోంది.

ప్రప్రథమంగా నక్సలైట్ పార్టీ 1978లో ఇల్లెందు అసెంబ్లీ సెగ్మెంట్‌లో గెలవడం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. సత్యనారాయణసింగ్, చంద్రపుల్లరెడ్డి నాయకత్వంలో ఎన్నికల బరిలో దిగిన ఎంఎల్ పార్టీ ఇల్లెందులో తమ అభ్యర్థి చాపాల ఏర్రయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకుంది. ఆ తరువాత ఎంఎల్ పార్టీ జనశక్తి, ప్రతిఘటన, విమోచన, ప్రజాపంథా, ప్రజాప్రతిఘటన పేరిట అనేక గ్రూపులుగా చీలింది. అయినా ఇల్లెందు ఏజెన్సీ గ్రామాల్లో తమ ప్రాబల్యాన్ని కాపాడుకుంటూ అసెంబ్లీ ఎన్నికలు మొదలు, సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీపీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనేక విజయాలు సాధించింది.

ఇల్లెందులో ఆ పార్టీ ఐదు పర్యాయాలు గుమ్మడి నర్సయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకుంది. తదనంతరం గుమ్మడి నర్సయ్య ప్రాతినిధ్యం వహించిన పార్టీ ప్రజాపంథా, న్యూడెమోక్రసీగా చీలిపోయింది. అయితే సాయుధ పోరాట పంథాను కొనసాగిస్తూ.. పార్లమెంటరీ పంథాను సైతం అనుసరించిన జనశక్తి పార్టీ సైతం సిరిసిల్ల నియోజకవర్గంలో ఒక పర్యాయం ఎమ్మెల్యేగా విజయం సాధించడం గమనార్హం.

గతంలో ఇల్లెందు నియోజకవర్గంలో తిరుగులేని అధిపత్యం సాగించిన నక్సలైట్లు నేడు ఉనికిని చాటుకోవాడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో విప్లవసంస్థలు పట్టు కోల్పోయాయి. పార్టీ విస్తరణ లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగుతుండడం గమనార్హం. గడిచిన ఐదేళ్లకాలంలో రెండు గ్రూపులుగా న్యూడెమోక్రసీ(రాయల)న్యూడెమోక్రసీ, మాస్‌లైన్‌గా చీలిపోగా, మరో గ్రూపుగా ఉన్న న్యూడెమోక్రసీ(చంద్రన్న) సైతం రెండు గ్రూపులుగా చీలిపోయి కార్యాకలాపాలు కొనసాగిస్తున్నాయి. అయితే సాయుధ దళాలు కలిగిన న్యూడెమోక్రసీ మరోవైపు పార్లమెంటరీ పంథాను కొనసాగిస్తుండగా, మాస్‌లైన్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. లోక్‌సభ ఎన్నికల్లో రెండు ఎన్డీ పార్టీలు ఉమ్మడి అభ్యర్థిగా మోకాళ్ల మురళీకృష్ణను బరిలో నిలిపగా, మాస్‌లైన్ పార్టీ ఇండియా కుటమికి మద్దతు ప్రకటించింది.

నేను స్థానికుడినే.. మీకు అందుబాటులో ఉంటా

- ఖమ్మంలో విస్తృత ప్రచారం చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి

ఖమ్మం సంక్షేమవిభాగం/ వైరా, మే 11: 'నేను పుట్టింది ఇక్కడే.. పెళ్లి చేసుకొంది ఈ జిల్లా అమ్మాయినే.. నేను మీవాడినే.. నన్ను ఎంపీగా గెలిపిస్తే జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తా' అంటూ ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రజలను కోరారు. శనివారం ఖమ్మంనగరంలో రఘురాంరెడ్డి విస్తృతంగా పర్యటించారు. శ్రీదేవి గ్రానైట్స్ యజమాని నల్లమోతు వెంకట్‌బాబు నివాసానికి వెళ్లిన రఘురాంరెడ్డికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అక్కడ వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. పేరు పేరున ప్రతి ఒక్కర్ని పరిచయం చేసుకుంటూ ఓట్లు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరావు, దండా పుల్లయ్య, మోతుకూరి గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

ఎంపీ ఎన్నికల్లో ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. మిట్టపల్లి నాగి అధ్యక్షతన శనివారం కాంగ్రెస్ అభ్యర్థి రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైరాలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, బాణోతు విజయబాయి, సీపీఎం డివిజ్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, ఆర్యవైశ్యసంఘం నాయకులు మిట్టపల్లి నాగి, కొప్పురావూరి వెంకటకృష్ణ, పోలా శ్రీను, శ్రీను, వెంపటి రంగా, కొప్పురావూరి శబరీనాథ్ పాల్గొన్నారు.

అధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- దక్షిణ భారత్‌కు ప్రధాని మోదీ అన్యాయం
- దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవి లోక్‌సభ ఎన్నికలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

మహబూబాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని పార్లమెంటరీ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైపోయిందని, మరికొన్నింటిలో మాత్రమే పోటీ ఉందని, అదికూడా బీజేపీతోనేని బీఆర్ఎస్ ఎక్కడా తమకు పోటీ కాదని స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ ఉత్తర, దక్షిణ భారతదేశానికి వ్యత్యాసం చూపుతూ దక్షిణాదికి తీరని అన్యాయం చేశారని చెప్పారు. దక్షిణ భారత్‌లో బీజేపీ పెద్దగా లేకపోవడంతో, ఉత్తర భారతంలో పార్టీ ఎంపీలుండడం చేతనో కాని దక్షిణాధికి నిధుల పంపిణీలో సమతూకం పాటించలేదని ఆరోపించారు. దేశ భవిష్యత్ నిర్ణయించేవి పార్లమెంట్ ఎన్నికలని, రాష్ట్రంలో అత్యధికంగా కాంగ్రెస్ ఎంపీలను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు గా నిలవాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిన బీజేపీని ప్రజలు విశ్వసించరని, నిరంకుశ పాలనను ఎదిరించిన, పోరాట పటిమ కలిగిన తెలంగాణను అవహేళన చేసుకుంటూ మాట్లాడుతున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే హిందువుల పుస్తెలు ముస్లింలకు ఇస్తారని ప్రధాని మోదీ తనస్థాయిని దిగజారి మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రం లో కాంగ్రెస్ సర్కార్ మూడు నెలల్లో కూలిపోతుందని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వం ఎలా కూలిపోతుందని నిలదీశారు. అనేక రాష్ట్రాల్లో ప్రతి పక్షపార్టీల ప్రభుత్వా లను బీజేపీ కూల్చిందని అది తెలంగాణలో సాధ్యం కాదన్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వాన్ని కదిలించడం బీఆర్ఎస్, బీజేపీ తరం కాదన్నారు.

బీఆర్ఎస్‌కు ఒక్క సీటుకూడా కష్టమే.!

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెల వడం కష్టమేనని తుమ్మల నాగేశ్వరరావు జోస్యం చెప్పారు. నిన్నటి వరకు ఒకటి, రెండు సీట్లలో వారికి ఆశలుండేవని ఇప్పుడు అవి కూడాపోయా యన్నారు. అసత్య ప్రచారాలతో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. చేపపిల్లలు, గొర్రెల పథకంలో అవినీతి జరిగిందని, వ్యవస్థలన్నిటిని బీఆర్ఎస్ విచ్ఛిన్నం చేసిందని మండిపడ్డారు. బీజేపీని గెలిపించడానికి బీఆర్ఎస్ తాపత్రయం పడుతోందని విమర్శించారు. ఉమ్మ డి మహబూబ్‌నగర్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్ లాంటిపార్లమెంటరీ నియోజకవర్గాల్లో తమకు ఏ పార్టీతో పోటీలేదన్నారు. ఇప్పటికే గెలుపు ఖాయమైందని, కొన్నింటిలో బీజేపీతో నేనని, బీఆర్ఎస్ తమకు ఎక్కడా పోటీ కాదన్నారు.

దేశంలోనే ఆదర్శవంతంగా తెలంగాణ సర్కార్..

తెలంగాణలో ఐదు గ్యారంటీలను అమలు చేసి, ప్రజలకు మేలు చేసే విధంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో 7 వేల పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిచిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం అప్పులు చేసి పోతే సీఎం రేవంత్‌రెడ్డి వాటికి వడ్డీలు కడుతూ నూతనంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. 69 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్ల రైతుబంధును అన్నదాతల ఖాతా ల్లో వేశామని పేర్కొన్నారు. ఆగస్టు 15 లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలవబోతుందన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సంక్షేమం

- మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. తన గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తున్నారని.. వారి మేలును ఎన్నటికి మరువనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని కోరారు. తనను మరోసారి ఆశీర్వందించి గెలిపించాలని విజ్ఞప్తి చేశా రు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, సాదు రమేష్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అం జయ్య, గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, కోడి శ్రీను పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయాలి

- బీజేపీ కర్ణాటక, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి
- నగరంలో భారీ బైక్ ర్యాలీ



ప్రసంగిస్తున్న సుధాకర్‌రెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్, మే11: ఖమ్మం పార్లమెంట్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని, అందుకు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ కర్ణాటక, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. చివరి రోజు ప్రచారంలో భాగంగా శనివారం ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కారుకు రిపేరు వచ్చిందని, దానిని ఖమ్మం మున్నేరులో వేయాలన్నారు. దేశ సమగ్రాభివృద్ధి చెందాలంటే మరోసారి మోదీ ప్రధాని కావాలని, రాజకీయపార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు కమలం గుర్తుపై ఓటువేసి వినోద్‌రావును గెలిపించాలన్నారు. అనంతరం పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌రావు మాట్లాడుతూ రాజకీయ స్పీచ్‌లంటే తెలియని తనకు, మీ అందరి ఆదరాభిమానాలు, నాయకుల సలహాలు, సూచనలతో ఈ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేశారన్నారు. నగరంలో ఇకపై ఉండి ఖమ్మం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానని వారి సమస్యలు తీర్చేందుకు కృషిచేస్తానన్నారు. కొద్ది గంటల్లో జరిగే పోలింగ్‌లో కమలం పై ఓటువేసి తనను గెలిపించాలన్నారు. ఈకార్యక్రమలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, దేవకి వాసుదేవరావు, అల్లిక అంజయ్య, ఉప్పల శారద, దొంగల సత్యనారాయణ, సన్నె ఉదయ్‌ప్రతాప్, వెంకయ్య, మంద సరస్వతి, దొడ్డ అరుణ, టీడీపీ నాయుకలు కేతినేని హరీష్,రాజేశ్వరి, ఎమ్మార్పీఎస్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం

- రోడ్డుషోలో బలరాంనాయక్, కోరం కనకయ్య



ఇల్లెందులో ప్రసంగిస్తున్న బలరాం నాయక్

ఇల్లెందు/ కామేపల్లి, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, ఆరుగ్యారెంటీల సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు పొందాలంటే కాంగ్రెస్‌ను బలపరచాలని మహబూబాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. శనివారం ఇల్లెందులో కాంగ్రెస్ రోడ్డుషో జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో జరిగిన సభలో బలరాం నాయక్ మాట్లాడుతూ మానుకోటలో కాంగ్రెస్ గెలుపు ఖాయమైందని స్పష్టం చేశారు. రాజకీయాలకు, వివక్షతకు తావులేకుండా లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందన్నారు. మిత్రపక్షాల మద్దతులో కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. కామేపల్లి మండలంలోని మద్దులపల్లి, జాస్తిపల్లి గ్రామ ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి పోరిక బలరాం నాయక్ ఓట్లను అభ్యర్థించారు. ఉపాధీ హామీ కూలీ రెట్లను కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వేతనం రూ.400 పెంచుతామని అన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- హోం ఓటింగ్‌లో రాష్ట్రంలోనే ఖమ్మం ముందంజ
- ఓటర్లను వాహనాల్లో తరలించడం నేరం
- రవాణాకు 'సాక్ష్యం' యాప్ ద్వారా నమోదు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, మే 11(ఆంధ్రజ్యోతి): లోకసభ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించే పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ. గౌతమ్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి శనివారం పోలింగ్ ఏర్పాట్లు, సైలెన్స్ పీరియడ్‌పై మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోం ఓటింగ్‌లో ఖమ్మం నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. మొత్తం 2,728 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్‌ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 1,896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు 27 ఎఫ్ఎస్టీ, 21 ఎస్ఎస్టీ, 31 ఎంసిసి బృందాలు, 203మంది సెక్టార్ అధికారులు, 6 రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటుచేశామన్నారు. వీటికి అదనంగా 5 ఎఫ్ఎస్టీ బృందాలతో శుక్రవారం నుంచి నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు ఓటర్లను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయడం నేరంగా పరిగణించి సెక్షన్ 177 కింద కేసులు నమోదు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే సీనియర్ సిటిజెన్స్, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రం వరకు రాలేనివారికి ఎన్నికల కమిషన్ ద్వారా రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. రవాణా సౌకర్యం కోసం 'సాక్ష్యం' యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ యాప్ ద్వారా ఇప్పటికి 15వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఈవీఎంలను సెక్టార్ అధికారులతో పాటు పోలీసు ఎస్కార్ట్‌తో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళతామని తెలిపారు. అలాగే సెక్టార్ ఆఫీసర్ల వద్ద రెండు చొప్పున రిజర్వ్ ఈవీఎం యంత్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్య వస్తే ఈ రిజర్వ్ ఈవీఎంలను వాడతారని తెలిపారు. పోలింగ్‌కు 48 గంటల ముందు సైలెన్స్ పీరియడ్‌గా పరిగణించి ప్రచార కార్యక్రమాలు, లౌడ్ స్పీకర్లపై నిషేధం విధించామన్నారు. నియోజకవర్గం పరిధిలో 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థికి ఒక వాహనం అనుమతితో పాటు నలుగురు వ్యక్తులకు అనుమతి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రం వంద మీటర్ల పరిధిలో ప్రచార కార్యక్రమాలకు నిషేధం ఉందన్నారు. అలాగే ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్ నిషేధించినట్లు తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు డ్రైడేగా ప్రకటించామని, 11 సాయంత్రం 6.00 గంటల నుంచి 13 వ తేదీ పోలింగ్ పూర్తయ్యేంత వరకు వైన్స్‌షాపులు, బార్లు బంద్ చేసినట్లు తెలిపారు. ఆదివారం పోలింగ్ పార్టీలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి మెటీరియల్ తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ రోజున సాయంత్రం 6.00 గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన వారికి చివరి నుంచి స్లిప్పులు ఇచ్చి పోలింగ్ పూర్తి చేస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100శాతం వెబ్ కాస్టింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ వివరించారు. ఓటింగ్ శాతం పెరగడానికి స్వీప్ ప్రచార కార్యక్రమాలు చేపట్టామన్నారు. వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించామన్నారు. ప్రతిఒక్కరూ ఓటు వేసి ఓటింగ్ శాతం పెరగడానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు..

లోక్‌సభ పోలింగ్ స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహణకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. శనివారం సాయంత్రం 6గంటల నుంచి సోమవారం పోలింగ్ ముగిసేవరకు వైన్స్, బార్‌ల మూసివేతకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. బల్క్ ఎస్ఎంఎస్‌లపై వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి 1,459 పోలింగ్ కేంద్రాలకుగాను 209 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, 86 లోకేషన్లలో ఉన్నట్టు తెలిపారు. ఈ కేంద్రాల్లో సెంట్రల్ ఆర్మ్ రిజర్వ్ ఫోర్స్ నియమించామన్నారు. కొత్తవారు, బయటివారు జిల్లాలో ఉంటే వెంటనే పంపిస్తామన్నారు. పోలింగ్‌కు 48గంటల ముందు సైలెన్స్ పీరియడ్‌లో 144సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ సందర్భంగా గోదాంలు, ఫంక్షన్ హాళ్లు, రిసార్ట్, ఫామ్‌హౌజ్‌లు తదితర చోట్ల నిఘా బృందాలు రైడ్స్ నిర్వహిస్తాయన్నారు. ఈ సమయంలో ప్రైవేటు పార్టీలకు అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ల అనుమతి లేదని సీపీ తెలిపారు. ఎన్నికల్లో 2,391 మంది పోలీసులు, 6 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. 20 ప్రత్యేక బృందాలు శాంతిభద్రతలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై తక్షణ చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు అందరూ సహకరించాలని సీపీ కోరారు.

భద్రాద్రి జిల్లాలో సాయంత్రం 4వరకే పోలింగ్: కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం, మే 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం 4గంటలకే ముగుస్తుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శనివారం సాయంత్రం 4గంటలకే ఎన్నికల ప్రచారం ముగిసిందన్నారు. జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో 169 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు తెలిపారు. దాంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటల లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నవారికి స్లిప్‌లు అందించి ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



ఇరు జిల్లాల్లో 144సెక్షన్

ఖమ్మంక్రైం/కొత్తగూడెం, మే 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం పోలీసకమిషనరేట్ పరిధితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ విధించారు. ఈ మేరకు ఖమ్మం పోలీసుకమిషనర్ సునిల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఉత్తర్వులు జారీచేశారు. శనివారం సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం ఆరుగంటల వరకు ఎలాంటి సభలు, సమావేశాలు ర్యాలీలకు, మైక్‌లకు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు గుంపులుగా గుమికూడి ఉండడానికి అనుమతిలేదని పేర్కొన్నారు. 144 సెక్షన్ విధించినట్లు ఖమ్మం సీపీ తెలిపారు.

నేడు పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ

ఖమ్మం, మే11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని ఆదివారం అధికారులు సంబంధిత ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేయనున్నారు. ఎవరెవరికి ఎక్కడ విధులు కేటాయించారో చెప్పి వారికి సామగ్రిని అందిస్తారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సెక్టార్ అధికారులతో పాటు పోలీస్ ఎస్కార్ట్ తో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తీసుకెళ్తారు. ఆదివారం రాత్రికి ఎన్నికల సిబ్బంది అక్కడనే బస చేయాల్సి ఉంటుంది. సోమవారం రోజు పోలింగ్ పూర్తయిన తర్వాత తిరిగి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్దకు ఈవీఎంలను చేర్చి అక్కడి నుంచి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలకు తరలించి భద్రపరుస్తారు.

ఖమ్మం, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, మధిర అసెంబ్లీకి సంబంధించి మధిరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, వైరాకు సంబంధించి స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సత్తుపల్లిలోని జ్యోతి నిలయం హైస్కూల్‌లో, కొత్తగూడెం అసెంబ్లీకి సంబంధించి రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అశ్వారావుపేట అసెంబ్లీకి సంబంధించిన అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో సామగ్రిని పంపిణీ చేస్తారు. ఖమ్మం లోక్‌సభకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అధికారులు ఈవీఎం యంత్రాలకు సంబంధించి కమీషనింగ్ చేసి సిద్ధంగా ఉంచారు.



ఖమ్మంలో గులాబీజెండా ఎగురవేస్తాం

- టీడీపీ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ లు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే తాతా మధుసూదన్‌లతో కలిసి నామా మాట్లాడుతూ గత 45రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తనకు వివిధ వర్గాలనుంచి ఎంతో స్పందన లభించిందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు తన విజయం కోసం రాత్రింబవళ్లు కసిగా పనిచేశారన్నారు. తాను భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని నామా ధీమా వ్యక్తం చేశారు. తాను తొలిసారి ఎంపీగా గెలిచినప్పుడు 1.50లక్షల గ్యాస్ కనెక్షన్‌లు, 60వేల రైల్వేపాస్‌లు ఉచితంగా పంపిణీ చేశానన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందునుంచే తన తండ్రి నామా ముత్తయ్య పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నోసామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ టీడీపీ, ఎంఆర్‌పీఎస్, సీపీఎం శ్రేణులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఆంధ్రాలో ఉన్న పొత్తులో భాగంగా ఇక్కడ బీజేపీకి మద్దతు ఇవ్వాలనే ఆలోచనపై టీడీపీ పునరాలోచించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషయ్య, తిరుమలరావు, నాగరాజు, తాజుద్దీన్, రాంమ్మూర్తి పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు ఓటుతో గుణపాఠం

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- చివరిరోజు ఖమ్మంలో రోడ్‌షో, బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్, టీడీపీ, వామపక్ష నాయకులు

ఖమ్మం,మే11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ద్వారా బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పబోతున్నారని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శనివారం సాయంత్రం ఖమ్మంలో బైక్ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. పీజీ కాలేజీ నుంచి మమతారోడ్డు, త్రీటౌన్, గాంధీచౌక్, బస్‌డిపో రోడ్డుమీదుగా నగరంలోని పలు వీధుల్లో బైక్ ర్యాలీతో పాటు మంత్రులు రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ, వామపక్షాల కార్యకర్తలు, నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రచారం ముగింపు సందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరి దీవెనలతో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు గట్టి సమాధానం చెప్పబోతున్నారన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పోలింగ్ రోజున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పోలిగ్‌శాతం పెంచేందుకు కృషిచేయాలన్నారు. పోలింగ్ రోజు కాంగ్రెస్, వామపక్షాలు, టీడీపీ కార్యకర్తలంతా సమష్టిగా కాంగ్రెస్ విజయం కోసం కృషిచేయాలని కోరారు., పోలింగ్ ప్రతిఇంటికి వెళ్లి ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో ఎంపీగా గెలిపించడం ద్వారా కేంద్ర నిధులు జిల్లాకు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. రోడ్‌షోలో సీపీఐ నాయకులు బాగం హేమంతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సైలెన్స్..

(7వ పేజీ తరువాయి)

విజయం కోసం ఆ పార్టీ అధినేత కేసీఆర్ సహా పలువురు నేతుల ప్రచారం నిర్వహించారు. నామాకు మద్దతుగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర విస్తృతంగా ప్రచారం సాగించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, రేగా కాంతారావు తదితరులు ప్రచారంలో పాలు పంచుకున్నారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఖమ్మం, కొత్తగూడెంలో బస్సుయాత్ర నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో రెండు రోజులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు చెందిన మరో రాజ్యసభ సభ్యుడు పార్థసారధరెడ్డి మాత్రం నామా నామినేషన్ కార్యక్రమానికి మాత్రమే హాజరయ్యారు. ప్రచారానికి దూరంగా ఉన్నారు. జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్‌తో పాటు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీప్రజాప్రతినిధులు నామ తరుపున ప్రచారంలో పాల్గొన్నారు.లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనే బీఆర్ఎస్‌కు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఒకొక్క ఎమ్మెల్యే అయిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది. ఖమ్మంలో మేయర్ పునుకొల్లు నీరజ కూడా కాంగ్రెస్ గూటికి చేరారు. శనివారం ప్రచారం ముగింపు సందర్భంగా ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, తాత మధు ఉమ్మడి సమావేశం నిర్వహించి పోలింగ్‌పై చర్చించారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత కూడా భద్రాద్రి జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

ఇక బీజేపీ ఈసారి ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం సాగించింది. ఖమ్మంలో ఆ పార్టీ అభ్యర్థిగా తాండ్ర వినోదరావు, మహబూబాబాద్‌లో సీతారాం నాయక్ బరిలో నిలిచారు. ఖమ్మంలో వినోదరావు తరుపున కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాకతీయ వారసుడు, బస్తర్ మహారాజు కమలచంద్ర భంజ్‌దేవ్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రచారం నిర్వహించారు. ప్రచారం చివరిరోజు కూడా ఖమ్మంలో రోడ్‌షో నిర్వహించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులే కాకుండా ఎన్నికల బరిలో నిలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారంతో ఎన్నికల ప్రచారం ముగియడంతో అధికారులు పోలింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు.

ప్రలోభాల పర్వం..

ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఘట్టం పూర్తి కావడంతో పార్టీలో పోల్‌మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాయి. అందులో భాగంగా పలువురు అభ్యర్థులు ఓటర్లకు నగదు పంపిణీ చేపట్టినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో కొందరు అభ్యర్థులు ఓటుకు రూ.500 పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే ఓటు చెల్లించే సొమ్ము చాలా తక్కువగా ఉండడంతో చాలామంది ఓటర్లుపెదవి విరుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇక ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పోలింగ్ శాతం తగ్గుతుందేమోన్న ఆందోళన అభ్యర్థుల్లో కనిపిస్తోంది. ఓటింగ్‌ను పెంచేందుకు కుల, సామాజిక సంఘాలతో చర్చలు సాగిస్తున్నారు. గ్రామాల్లో యువతకు మద్యం భారీగా పంపిణీ చేస్తున్నారు.

భద్రాద్రి దేవస్థానం ఏఈవో సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, మే 11: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలో ఉన్న జానకీసదనం ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఈ ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీతారామచంద్రస్వామి దేవస్థానం ఏఈవో వి.శ్రావణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు దేవస్థానం ఈవో రమాదేవి అధికారిక ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. దేవస్థానానికి చెందిన ఓ అధికారి మూడేళ్ల క్రితం జానకీసదనం నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ ధార్మిక సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏఈవో ఓ ప్రైవేటు వ్యక్తిని పరిచయం చేయగా, ఆయన ద్వారా పలు విడతల వారీగా రూ.18 లక్షల వరకు వసతి గదుల నిర్మాణం నిమిత్తం సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ మొత్తం దేవస్థానం ఖజానాకు జమకాకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన సదరు ధార్మిక సంస్థ ప్రతినిధులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ దేవస్థానం అధికారులను ఈ విషయమై వివరణ సైతం కోరారు. ఈ క్రమంలో ఏఈవోకు దేవస్థానం ఈవో చార్జి మెమోలు జారీ చేసినా ఆయన ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో ఈ విషయమై విచారణ చేయాలని కమిషనర్‌కు నివేదించారు. దీంతో ఈ ఉదంతంపై విచారణాధికారిగా దేవాదాయశాఖ అదనపు కమిషనర్ ఎంఎండీ కృష్ణవేణిని నియమించారు. ఆమె విచారించి నివేదికను కమిషనర్‌కు అందజేశారు. ఏడీసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని దేవస్థానం ఈవోను కమిషనర్ ఆదేశించారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఈవోను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈవో అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ విషయమై ధార్మిక సంస్థ ప్రతినిధులు నిలదీయడంతో ఇటీవల భద్రాచలంలోని వసతి గృహాల్లో తిరిగి ఆ మొత్తం చెల్లించినట్లు ప్రచారం సాగింది.

రాజకీయ నాయకుడి ఇంటి వద్ద అధికారుల మోహరింపు


కల్లూరు, మే 11: మండలంలోని లింగాల గ్రామంలో ఓ రాజకీయ పార్టీ నాయకుడి ఇంట్లో నగదు నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటలకు వరకు మోహరించారు. సదరు రాజకీయ పార్టీ నాయకుడి ఇంట్లో తనిఖీ చేసేందుకు సెర్చ్‌వారంట్ లేనందున ఎన్నికల తనిఖీ అధికారులతో పాటు పోలీసులు అలాగే మోహరించారు. లింగాలలో సదరు రాజకీయ నాయకుడి ఇంటి ముందు మోహరించిన వారిలో ఫ్లైయింగ్ అధికారి ప్రభాకర్‌రావు, ఎస్ఐ షాకీర్, ఇన్‌కంటాక్స్ అధికారి సాయికుమార్, ఎన్నికల వ్యయ అధికారి ఉన్నట్లు తెలిసింది.

బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలు

- కేసీఆర్‌కు పదవీ వ్యామోహం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ముగ్గురు మంత్రులతో కలిసి పనిచేసే అవకాశమివ్వండి: కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 11: జైల్లో ఉన్న తన బిడ్డను కాపాడుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీని పగలు తిడుతూ రాత్రి సంప్రదింపులు చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పరోక్షంగా బీఆర్ఎస్ డమ్మీ అభ్యర్థులను బరిలో నిలిపిందన్నారు. ఆ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలని విమర్శించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఏకిపారేశారు. దేశంలో 540 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను పెట్టని బీఆర్ఎస్ ఖమ్మంలో నామాను గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేస్తానని కేసీఆర్ ఎలా చెప్పారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు ఇప్పటికీ పదవీ వ్యామోహంతోనే ఉన్నారన్నారు. అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ 20రోజులు తనతో పాటుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బలపర్చిన సీపీఎం, సీపీఐ, ఇతర పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో కలిసి పనిచేసే అవకాశం కల్పించాలని ప్రజలను అభ్యర్థించారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండీ జావీద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబాని చంద్రశేఖర్‌రావు, జెబీ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
10
ఆదివారం 12 మే 2024



పుట్టకోట, లకారం చెరువులకు సాగర్ జలాలను విడుదల చేయాలి



తుమ్మలతో మాట్లాడుతున్న రావూరి

ఖమ్మం సంక్షేమవిభాగం,మే 11: ఖమ్మం నగరంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాగార్జున్ సాగర్ జలాలను లకారం, పుట్టకోట చెరువులోకి తరలించాలని వీ వెంకటాయపాలేం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. శనివారం మంత్రి తుమ్మలను ఖమ్మంలో కాంగ్రెస్ నాయకులు కలుసుకొని తాగునీటి ఎద్దడిని వివరించారు. స్పందించిన మంత్రి రెండు చెరువులకు నీటి విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. మాజీ కార్పొరేటర్లు చావా నారాయణరావు, కమర్తపు మురళీ, సంక్రాంతి నాగేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, ముప్పారావు ఉపేందర్ పాల్గొన్నారు.

అడ్డదారిలో చేరికలు !



పొంగులేటి, మువ్వాలను కలసిన కౌన్సిలర్ ప్రసాద్

- సత్తుపల్లి కాంగ్రెస్‌లో విచిత్ర రాజకీయం
- కొందరు బీఆర్ఎస్ నేతల చేరికను వ్యతిరేకించిన స్థానిక నేతలు
- కాంగ్రెస్‌లో కొందరి సత్సంబంధాలతో భవిష్యత్‌లో చేరికకు హామీ
- వ్యూహంలో భాగంగా ముందుగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు

సత్తుపల్లి, మే11: సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలో విచిత్ర రాజకీయం నెలకొంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో కొందరు నాయకులను చేర్చుకునేందుకు స్థానిక కాంగ్రెస్ నాయకత్వం నిరాకరించింది. కాని వారు ఇతర నాయకులను సంప్రదించి బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నారు. రెండురోజులుగా ఈ రకమైన రాజీనామాలు, మద్దతు ప్రకటనలు కొనసాగుతున్నాయి. పార్టీలో నేరుగా చేరకుండా ముందుగా మద్దతు ప్రకటించి రానున్న రోజుల్లో పరిస్థితులు చక్కబడిన తరువాత వారిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటారని ప్రచారం జరుగుతోంది.

పూర్వపరాలు ఇవీ...

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం, సత్తుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిని మట్టా రాగమయి గెలుపొందటంతో ఆ పార్టీ మంచి జోష్‌లో ఉంది. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌లో కొనసాగిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలో లేని సమయంలో బీఆర్ఎస్‌లో ఉండి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థినికి వ్యతిరేకంగా పని చేసిన వారిని పార్టీలో చేర్చుకోబోమని కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ప్రకటించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల సమ్మతి ఉంటేనే చేర్చుకుం టామని ప్రకటించారు. ఈ క్రమంలో కొందరిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కాని నియోకవర్గంలోని సత్తుపల్లి మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను చేర్చుకునేందుకు నిరాకరించారు. వారు వేరే నాయకుడి సమక్షంలో పార్టీలో చేరాలని ప్రయత్నాలు చేయటంతో చేరికను స్థానిక ఎమ్మెల్యే రాగమయి అనుచరులు అడ్డుకున్నారు.

రూటు మార్చిన నాయకులు

కాంగ్రెస్‌లో పలువురు నాయకులు చేరటాన్ని స్థానిక ఎమ్మెల్యే అడ్డుకోవటంతో మరికొందరి ప్రోత్సాహంతో సదరు బీఆర్ఎస్ నాయకులు రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలోనే సత్తుపల్లి మండలం నారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు తుమ్మూరు కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి అభ్యర్థి రఘురామిరెడ్డిని కలసి మద్దతు ప్రకటించిన విషయం విదితమే. సత్తుపల్లి మునిసిపల్ కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, వేములపల్లి పుష్పలత, మాజీకౌన్సిలర్ వేములపల్లి మధులు శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయ బాబును కలసి రఘురామిరెడ్డి విజయం కోసం పని చేస్తామని ప్రకటించారు. వేంసూరు మండల బీఆర్ఎస్ నాయకుడు సంజీవరెడ్డి, కల్లూరు మండలంలో సొసైటీ అధ్యక్షుడు కీసర వెంకటేశ్వరరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. తాజాగా శనివారం సత్తుపల్లి మునిసిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ దేవరపల్లి ప్రవీణ్, సత్తుపల్లి మండలం యాతాలకుంట బీఆర్ఎస్ అధ్యక్షుడు మోదుగు లక్ష్మీనారాయణ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురామిరెడ్డికి మద్దతు ప్రకటించారు.

ఒకరు వద్దంటే మరొకరు అక్కున చేర్చుకొని...

బీఆర్ఎస్‌కి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరకుండా స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకోగా వారిని రాజీనామా చేయించి అధికార పార్టీలో ఇతర నాయకులు అక్కున చేర్చుకోవటం చర్చనీయాంశంగా మారింది. ఒకరు వద్దంటే మరొకరు వేరే రూపంలో అక్కున చేర్చుకోవటాన్ని ఎమ్మెల్యే వర్గీయులు నిశితంగా గమనిస్తున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు హాట్ టాపిగ్గా మారాయి. ఈ పరిస్థితులు ఎటుదారి తీస్తాయోనని పార్టీ కేడర్‌లో చర్చ సాగుతోంది.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ వీపీ గౌతమ్



ఖమ్మంకలెక్టరేట్, మే11: జిల్లాలో రేపు జరిగే లోకసభ సాధారణ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది 3వ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి కోల్టే తో కలిసి ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో 5 అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1459 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మూడోదశ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ సిబ్బందిని కేటాయించామన్నారు. 3వదశ ర్యాండమైజేషన్‌లో పోలింగ్ కేంద్రాల వారిగా పోలింగ్ బృందాలను ఆన్ లైన్ సాఫ్ వేర్ వినియోగించుకొని పారదర్శకంగా కేటాయించినట్లు తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను కేటాయించామన్నారు.ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏఆర్‌ఓలు, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్ఐసి కోఆర్డినేటర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు

ఖమ్మంక్రైం, మే11: శాంతిభద్రలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినుయోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా శనివారం నగరంలో స్థానిక పోలీసు, కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ లోకసభ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సాగేలా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే నిఘాపెట్టి తనిఖీలు ముమ్మరం చేస్తున్నారని అన్నారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్లామని అందులో భాగంగానే కమిషనరేట్ వ్యాప్తంగా సెంట్రల్ పోలీస్‌ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి అనేక ప్రాంతాల్లో విధుల్లో తిరుగుతూ ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూనే, ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ కమాండెంట్ రన్‌విజయ్‌సింగ్, ఏసీపీ రమణమూర్తి, శ్రీనివాసులు, సీఐలు శ్రీహరి, భానుప్రకాష్, బాలకృష్ణ, ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

కామేపల్లి,మే11: కామేపల్లిలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.. ఇటీవల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో ఇల్లందు క్యాంపు కార్యాలయంలో 200కుటుంబాలలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గుగులోత్ సక్రు, చల్లా హరి, దొడ్డ మల్లేష్, ఉప్పగుండ్ల వీరభద్రరావు, ఐతన బోయిన విఠల్‌రావు, దండగల దేవేందర్, అంబడిపుడి వెంకటేశ్వర్లు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, కల్లేపల్లి నిర్మల, బూలమ్మ, కొమ్మినేని శ్రీనివాసరావు ఉన్నారు.

సత్తుపల్లి:సత్తుపల్లి మునిపల్ రెండో వార్డు కౌన్సిలర్ దేవరపల్లి ప్రవీణ్ బీఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేసినట్లు శనివారం ప్రకటించారు. సత్తుపల్లి మండలం యాతా కుంట బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు మోదు లక్ష్మీ నారాయణ అతడి అనుచరులు కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. వీరంతా కాంగ్రెస్ అభ్యర్థి రఘురామిరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఏన్కూరు: ఏన్కూరు మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూక్యా చందులాల్‌నాయక్ శనివారం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. చందులాల్‌తో పాటు కోనాయపాలెం, జన్నారం ఎస్టీ కాలనీలకు చెందిన మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సుమారు 40 కుటుంబాలు చేరాయి. వీరిలో మాజీ జడ్పీటీసీ భూక్యా సాజి, మాజీ సర్పంచ్ దూద్యా నాయక్, ఎంపీటీసీ మహేష్‌కుమార్, చింతల నరసింహారావు, హరిసింగ్ తదితరులున్నారు.

ఎన్నికల బందోబస్తును సమర్థంగా నిర్వహించాలి

- అదనపు డీసీపీ ప్రసాదరావు



మాట్లాడుతున్న అదనపు డీసీపీప్రసాదరావు

ఖమ్మంక్రైం, మే11: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తును సమర్థంగా నిర్వహించాలని అదనపు డీసీపీ ప్రసాదరావు అన్నారు. నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం ఎన్నికల బందోబస్తు పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌లో పోలింగ్ కేంద్రాల వద్ద పరిసర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం జరగకుండా చూడాలన్నారు. ఓటువేయడానికి వచ్చిన వారు క్యూలైన్లలో ఉండే విధంగా చూడాలన్నారు. భద్రత కలిపించడం, శాంతిభద్రతలను పర్యవేక్షించడం తప్ప పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఇతర అంశాల్లో ప్రమేయం ఉండరాదన్నారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. ఈసమావేశంలో ఏసీపీ రమణమూర్తి, ట్రెయినీ ఏఎస్పీ మౌనిక ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, టుటౌన్ సీఐ బాలకృష్ణ, పాల్గొన్నారు.

మధిరటౌన్: ఎన్నికల బందోబస్తును సమర్థంగా నిర్వహించి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా పోలీసు సిబ్బంది పనిచేయాలని ఖమ్మం ఏఎస్పీ అవినాష్ కుమార్ సూచించారు. శనివారం మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో మధిర నియోజకవర్గంలో ఎన్నికల బందోబస్తులో పాల్గొనే పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో మధు, శ్రీధర్, అంజన్ రావు, ఆర్ఐ నాగుల్‌మీరా ఎస్ఐలు పాల్గొన్నారు.

వైరా: వైరాఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 21లోకేషన్ల పరిధిలో 40క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. ఈ స్టేషన్లలో పోలింగ్‌పై పోలీసు సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. నియోజక వర్గంలోని 252పోలింగ్ స్టేషన్లను 23రూట్లుగా గుర్తించారు. ఇద్దరు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, సివిల్, ఏఆర్ ఎస్ఐలు 27మంది, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 40మంది, పోలీసు కానిస్టేబుళ్లు 196మంది, హోంగార్డులు 70మంది, సీఐఎస్ఎఫ్, టీఎస్ఎస్‌పీకి చెందిన 12సెక్షన్ల బలగాలు 120 మందిని బందోబస్తు కోసం నియమించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సీఐలు, ఎస్ఐలు ఇతర పోలీసు సిబ్బందికి శనివారం వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శిక్షణనిచ్చారు. సమర్థవంతంగా విధులు నిర్వహించాలని వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్ సూచించారు.

ఖమ్మంరూరల్: లోక్‌సభ ఎన్నికల బందోబస్తును సమర్థంగా నిర్వహించి విజయవంతంగా పూర్తి చేయాలని అదనపు డీసీపీ ప్రసాద్‌రావు తెలిపారు. మండల పరిధిలోని నాయుడుపేటలోని టీసీవీరెడ్డి ఫంక్షన్ హాల్లో శనివారం పోలీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ట్రెయినీ ఐపీఎస్ మౌనికా, రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజిరెడ్డి, ఎస్ఐ శకంర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దానవాయిగూడెం చెక్‌డ్యాంకు జలకళ

- పాలేరు జలాశయం నుంచి 500 క్యూసెక్కుల నీరువిడుదల
- మంత్రి తుమ్మల ఆదేశాలతో తాగునీటి సమస్యకు చెక్



దానవాయిగూడేనికి వచ్చే మార్గంలో సాగర్‌జలాలు

ఖమ్మంకార్పొరేషన్, మే11: వేసవికాలంలో ఖమ్మంలో తాగునీటి సమస్య తలెత్తకుండా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశంతో నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. పాలేరు జలాశయం నుంచి 500 క్యూసెక్కుల నీటిని ఖమ్మంలోని దానవాయిగూడెం చెక్‌డ్యాంకు విడుదల చేశారు. శనివారం సాయంత్రం సాగర్‌జలాలు దానవాయిగూడెం చెక్‌డ్యాంకు చేరాయి. దీంతో వేసవిలో ఖమ్మంలో తాగునీటి సమస్య తీరనుంది. అంతేకాకుండా సాగర్‌జలాలు విడుదలతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. పాలేరు జలాశయంలో గరిష్ట నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం 15.10 అడుగుల మేర నీరు నిల్వఉంది. కాగా ఖమ్మం నగర ప్రజలకు తాగునీటిని అందించేందుకు 500 క్యూసెక్కుల నీటిని పాలేరు జలాశయం నుండి ఖమ్మంలోని దానవాయిగూడెం చెక్‌డ్యాంకు విడుదల చేయాలని మంత్రి తుమ్మల నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం పాలేరు జలాశయంనుండి ఎడమకాలువ ద్వారా నీటిని విడుదల చేయగా, శనివారం సాయంత్రానికి ఖమ్మంలోని దానవాయిగూడెం చెక్‌డ్యాం వద్దకు చేరాయి.

వ్యక్తుల కంటే రాజకీయ విధానాలే లక్ష్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే11: ఎన్నికల బరిలో ఉన్న వ్యక్తులు, కులాలు, మతాల కంటే రాజకీయ విధానాలే లక్ష్యంగా ఓట్లు వేయాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు కోసం ద్వీ చక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఊపీ ర్యాలీ ప్రారంభించారు. నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, ఎస్‌కే మీరా, ఎస్ నవీన్‌రెడ్డి, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు, మయూరిసెంటర్, వైరా రోడ్డు, ముస్తాఫానగర్, గాంధీచౌక్‌లో ర్యాలీని నిర్వహించారు.

పెరిగిన టెక్నాలజీతో పిల్లలపై సెల్‌ఫోన్ ప్రభావం



జ్యోతిప్రజ్వల చేస్తున్న డాక్టర్ కనకదుర్గ, పాఠశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే11: సెల్‌ఫోన్‌ల వాడకం పిల్లలపై విపరీతంగా ప్రభావాన్ని చూపుతోందని క్లీనికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కలిదిండి కనకదుర్గ అన్నారు. శనివారం నగరంలోని ఓపార్క్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సెడార్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో పిల్లల పెంపకంపై తల్లితండ్రులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హార్వెస్ట్ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ యలమంచిలి నాగమణి, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, సెడార్ వ్యాలీ డైరెక్టర్ చల్లపల్లి ఉదయశ్రీ, హార్వెస్ట్ కరస్పాండెంట్, సెడార్ వ్యాలీ డైరెక్టర్ రవిమారుత్ హాజరయ్యారు. కనకదుర్గ మాట్లాడుతూ చిన్నచిన్న కుటుంబాలలో తల్లితండ్రులు వారివారి పనుల్లో తీరికలేకుండా ఉండటం వలన పిల్లలపై శ్రద్ధ తక్కువగా ఉంటుందన్నారు. పిల్లలు ఎదిగే క్రమంలో సామాజిక ప్రవర్తనకు కావాల్సిన శిక్షణ, కుటుంబ, వ్యక్తిగత విషయాలలో తల్లితండ్రులు సలహాలు, సూచనలు లేకపోవటం కొంత బాధాకరం అన్నారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడుతూ బాల్యాన్ని ఒత్తిడి లేకుండ స్వేచ్ఛాయుతంగా పెంచే విధానాలపై అవగాహన కల్పించటం సంతోషకరమని అన్నారు. వచ్చే విద్యా సంసవత్సరం నుంచి నగరంలో మెట్టమెదటి సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభిస్తున్నామని తెలిపారు.

హెచ్‌ఆర్‌ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయరావు



కల్లూరు,మే11: నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కువ్వారపు విజయరావు నియమితులయ్యారు. హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో కల్లూరులో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు బి దాసు, రాష్ట్ర ప్రెసిడెంట్ ఎనముల రుక్మిణి హాజరయ్యారు. మండలంలోని ముగ్గువెంకటపురం గ్రామ మాజీ సర్పంచు కువ్వారపు విజయరావును వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- ఆలయానికి వెలుతూ కారేపల్లిలో ఒకరు, కామేపల్లిలో మరొకరు..

కారేపల్లి, మే11: ఆలయంలో పూజ చేసేందుకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కారేపల్లిలో చోటు చేసుకుంది. కారేపల్లి క్రాస్ రోడ్డుకు చెందిన చింత లక్ష్మి(30) మండల కేంద్రంలో ని సాయిబాబా మందిరంలో జరుగుతున్న పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు వారి దుకాణంలో పని చేసే గుమాస్తా ద్విచక్ర వాహనంపై వెళుతోంది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఆమె రోడ్డుపై పడిపోయింది. ఇదేసమయంలో అదేదారిపై వస్తున్న ట్రాక్టర్ ఆమెపై నుంచి వెళ్లింది. స్థానికులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా వైద్యులు సకాలంలో ఆక్సిజన్ పెట్టి ఉంటే లక్ష్మి బతికేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మృతిరాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామేపల్లి: కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్‌కు చెందిన నర్సింహరావు(30) ద్విచక్ర వాహనంపై తాళ్లగూడెంలోని అత్తగారికి ఇంటికి వచ్చి వెళుతున్నాడు. పండితాపురం సంత సమీపంలో ఓ లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సిమెంట్ ఇటుక మీద పడి వ్యక్తి మృతి..

ఎర్రుపాలెం, మే11: సిమెంట్ ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తూ సిమెంట్ ఇటుక పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సఖినవీడు మొలగుమాడు గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన కొంగల సుధాకర్(35) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సఖినవీడు గ్రామానికి వస్తుండగా, సిమెంట్ ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ పై నుంచి సిమెంట్ ఇటుక అతడి మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా మధిర ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పశువుల మృత్యువాత



విలువగల పాడిగేదె రక్షణ వలయం లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదవశాత్తూ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

సత్తుపల్లిరూరల్, మే11: పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి 8 పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన సత్తుపల్లి మండలంలో చోటు చేసుకుంది. యాతాలకుంటకు చెందిన బాధితులు దోనెకంటి శ్రీనుకు చెందిన 5, పల్లె ఎల్లయ్యకు చెందిన 2పాడి గేదెలు మేత కోసం పొలాలకు ఉదయం వెళ్లాయి. కాగా శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి గ్రామంలోని పంట పొలాల్లో 11కేవీ విద్యుత్ లైన్ తెగిపోయింది. ఎవరూ గమనించలేదు. ఆ విద్యుత్ వైర్లను తగిలి అవి అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.7లక్షల విలువైన 7గేదెలు చనిపోయాయి. అదే విధంగా తాళ్లమడకు చెందిన మోరంపూడి పార్వతికి చెందిన సుమారు రూ.70వేల

ఇంటర్మీడియట్ ర్యాంకర్లకు సన్మానం



ర్యాంకర్లను సన్మానిస్తున్న క్రిసెంట్ ఫార్మ కంపెనీ అధినేత జానీమియా

కల్లూరు, మే11 ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకులు సాధించిన ఇద్దరు విద్యార్థులను కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో శనివారం అభినందించారు. ఎస్‌కే సన, ఇంటర్ ప్రథమ బైపీసీ 435, కే.గోవర్ధన్ ఎంపీసీ 467 మార్కులు సాధించారు. క్రిసెంట్ ఫార్మ కంపెనీ అధినేత, పాఠశాల చైర్మన్ ఎస్‌కే జానీమియా, వైస్‌చైర్మన్ పసుమర్తి చందర్‌రావు రూ.10వేలు ప్రోత్సాహక నగదును అందించారు. పేదకుటుంబాలు కావటంతో ఇంటర్మీడియట్ ద్వితీయ సంత్సరం పరీక్ష ఫీజు కూడా చెల్లించేందుకు పాఠశాల తరుపున జానీమియా ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్ రంజిత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ కేశవరావు, హెచ్‌ఎం ఇందిరా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఎర్రుపాలెం,మే11: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన భక్తుడు కుర్ర అప్పారావు దంపతులు జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష రూపాయలను వితరణ చేశారు. నగదును ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు కు అందజేశారు. దాతకు దేవస్థానం తరపున శేషవస్త్రాలు, ప్రసాదాలను అందించారు. కాగా శనివారం శ్రీవారికి సర్వాంగభిషేకం నిర్వహించి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు.

చర్చికి రూ.2,00,116 విరాళం

తల్లాడ, మే11: మండల పరిధిలోని కుర్నవల్లిలో పునీత తేరేజమ్మ చర్చికి ఎక్కిరాల ప్రసాద్, వెంకటనర్సమ్మ ఇంప్రాకంపెనీ అధినేత ఎక్కిరాల బజార్ రూ.2,00,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బజార్‌ను ఖమ్మం బిషప్ పాదర్ ప్రకాష్, సుపీరియర్ పాదర్ జోజప్ప, విచారణ గురువు పాదర్ కిరణ్‌కుమార్ సన్మానించారు.

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ప్రసాద్‌రెడ్డి

ఖమ్మంరూరల్, మే11: మండల పరిధిలోని గోళ్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తేజావత్ పంతులు నాయక్, సంపెట ప్రశాంత్ శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వరంగల్‌క్రాస్ రోడ్డులో రఘురాంరెడ్డి ప్రచారానికి వెళుతుండగా ద్విచక్రవాహనం పల్టీకొట్టింది. స్థానికులు వెంటనే 108 ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శనివారం ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

వైరా,మే11: వైరా మునిసిపాలిటీ సహా ఎక్కడా వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం ఎస్ఈ సదాశివకుమార్, ఈఈ వాణీశ్రీతో కలిసి వైరా రిజర్వాయర్ వద్దనున్న మిషన్ భగీరథ పథకాన్ని సందర్శించారు. ప్రస్తుతం వైరా మునిసిపాలిటీకి ప్రతిరోజూ సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ తాగునీటి వివరాలను రికార్డులు పరిశీలించి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈ మూర్తి, ఏఈలు పాల్గొన్నారు.

ముగిసిన టీఎస్ ఈఏపీసెట్ పరీక్షలు

ఖమ్మంఖానాపురంహవేలి, మే11: ఈనెల7 నుంచి ప్రారంభమైన టీఎస్ ఈఏపీసెట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఖమ్మం జిల్లాలో 7, భద్రాద్రా కొత్తగుడెంలో రెండు పరీక్షా కేంద్రాలలో ఉదయం సెషన్లలో పరీక్ష నిర్వహించారు. ఖమ్మంలో ఉదయం సెషన్‌లో 1560 మందికి 1509 మంది పరీక్షకు హాజరయ్యారు. సత్తుపల్లిలో ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 429 మంది విద్యార్థులకు 401 మంది, హాజరయ్యారు.భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలో నిర్వహించిన ఉదయం పరీక్షకు మొత్తం విద్యార్థులు 220 మందికి 217 మంది పరీక్షకు హాజరయ్యారు.

వడదెబ్బతో వ్యక్తి ..

కామేపల్లి, మే11: వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. కామేపల్లి మండలం గోవింద్రాల బంజర గ్రామానికి చెందిన ఉప్పరి బూషి(55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వడదెబ్బ తగిలి శనివారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.